ప్రజాశక్తి

శుక్రవారం 29 నవంబర్ 2024 5

పార్వతీపురం మన్యం

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు స్థానిక బాలికల గురుకుల పాఠశాలకు చెందిన హెచ్.లక్షహిత ఎంపికైనట్లు రాష్ట్ర గిరిజన స్పోర్ట్స్ కో ఆర్డినేటర్, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం తెలిపారు. జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల టిసిఆర్, టిఎం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. శుక్రావరం కేరళలోని వయనాడ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

జాతీయ పోటీలకు ఎంపికైన లక్షిహిత

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

- ఐటిడిఎ పిఒ గా చేయాలన్నది నా కల
- కోచింగ్ లేకుండానే అనుకున్న లక్ష్యాన్ని సాధించా
- గిరిజనులు మానసికంగా చాలా బలవంతులు
- సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ

ప్రజాశక్తి - పార్వతీపురం

నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలనే చిత్తశుద్ధి, అంకితభావం వుంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించారు ఆ యువ ఐఎఎస్ అధికారి. ఐఎఎస్ సాధించడానికి ముందు ఎన్ని ఉద్యోగాలొచ్చినా సంతృప్తి చెందకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆయన పరితపించారు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందినప్పటికీ ఎలాంటి కోచింగ్ లేకుండానే లక్ష్యసాధన కోసం ఒక్కో మెట్టు ఎక్కుతూ ఐదో ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు. ఆయన కృషి పట్టుదల యువతరానికి స్ఫూర్తిదాయకం కానున్నాయి. ఆయనే సబ్ కలెక్టర్, పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ. ఆయన జీవన గమనంలో సాధించిన విజయాలపై ఈ వారం జీవన కథనం.

కుటుంబ నేపథ్యం ...

అశుతోష్ మిశ్రా స్వస్థలం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలి యర్ పట్టణం. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు. తండ్రి ప్రదీప్ శ్రీ వాత్సవ న్యాయవాది. అనారోగ్యంతో మతి చెందారు. తల్లి అర్చనా శ్రీవాత్సవ గృహిణి. అన్నయ్య అంకిత్ శ్రీవాత్సవ ప్రయివేటు ఉద్యోగంలో స్థిరపడ్డారు. నాన్న న్యాయవాది అయినా పెద్దగా ప్రాక్టీస్ వుండేది కాదు. దీంతో కోచింగ్ తీసుకోకుండానే సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఐఎఎస్ సాధించాలనే లక్ష్యంతో చదివారు.

విద్యాభ్యాసం

1991 ఫిబ్రవరి 6న ఆయన జన్మించారు. విద్యాభ్యాసమంతా గ్వాలియర్‌లో సాగింది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుకున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ కేంద్రీయ విద్యాలయంలో పూర్తి చేశారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మాధవ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లో బిఇ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశారు.

ఉద్యోగ నేపథ్యం

ఇంజనీరింగ్ పూర్తి కాగానే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పరీక్ష ద్వారా **అశుతోష్ శ్రీ వాత్సవ** ఆడిటర్ ఉద్యోగం సాధించారు. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లో ఆడిటర్ ఉద్యోగంలో చేరారు. తర్వాత మధ్యప్రదేశ్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్ష లో ప్రతిభ చూపి డిఎస్‌పి ఉద్యోగం సాధించారు. ఈ ఉద్యోగం కోసం శిక్షణ పొందుతునే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టారు. మొదటి రెండు ప్రయత్నాలలో సాధించలేకపోయినా కృషి, పట్టుదలతో .మూడో ప్రయత్నం లో ఇండియన్ రైల్వే అండ్ ట్రాఫిక్ సర్వీసెస్ సాధించారు. దీంతోనూ సంతృప్తి చెందకుండా నాలుగో సారి ప్రయత్నం చేసి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ సాధించారు. అయినా ఆగకుండా ఐదో ప్రయత్నం లో 2020లో ఐఎఎస్ సాధించారు. తర్వాత పాడేరు లో ట్రయినీ కలెక్టర్ గా, 2023 లో కొవ్వూరు సబ్ కలెక్టర్ గా చేరారు. ఆ తర్వాత పార్వతీపురం సబ్ కలెక్టర్ గా వచ్చారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని శ్రీవాత్సవ్ అంటున్నారు.

యువతకు అశుతోష్ శ్రీ వాత్సవ సందేశం

సాధించాలనే తపన,పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని, ఒక ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్దేశించుకున్నప్పుడు ఎన్ని కష్టాలు, అడ్డంకులు ఎదురైనా అధిగమించవచ్చునని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. దురలవాట్లకు దూరంగా వుంటూ లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని యువతకు సూచించారు. .తాను ట్రయినీ కలెక్టర్ గా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో తిరిగానని, మారుమూల గిరి శిఖర గ్రామాల్లో పర్యటించి గిరిజనుల జీవన స్థితిగతులు పరిశీలించానని తెలిపారు. గిరిజనులు మానసికంగా చాలా బలవంతులని, అందుకే వారు కనీస మౌలిక సదుపాయాలు లేని కొండకోనల్లో జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాననని చెప్పారు. గిరిజనులు అమాయకులు, మంచి మనసున్న వాళ్ళు అని, వారి సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి తగినంత కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సంగీతంపై ఉన్న మక్కువతో పాటలు ఆలపిస్తున్న పిఒ శ్రీవాత్సవ

తల్లితో కలిసి దీపావళి సంబరాలు జరుపుకుంటున్న పిఒ (ఫైల్)

అదానీతో ఒప్పందాలు రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - పార్వతీపురం

టిడిపి కూటమి పార్టీలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, అదానీ గ్రూపు, సెకితో కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్జీవో హోంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో వామపక్ష నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.రమణి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ, సిపిఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పి.రంజిత్ కుమార్, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (లిబరేషన్) నాయకులు పి సంగం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.నరసింగరావు తదితర సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ప్రవేశపెడితే, విద్యుత్ భారాలు వేస్తే టిడిపి వాటిని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాలు అమలు చేయడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని అన్నారు. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయాలన్న తీర్మానాన్ని రెడ్డి వేణు ప్రవేశపెట్టారు. అన్ని మండలాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు జరపాలని, డిసెంబర్ 2న కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వాలని పాల్గొన్న నాయకులు, సభ్యులు చర్చించి ఆమోదించారు. రూ.17వేల కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారాన్ని రద్దు చేసి ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని కోరారు. ట్రూ అప్ విధానాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ఎన్నికల వాగ్దానం ప్రకారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని, కేంద్ర విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని కోరారు. నివాసాలకు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పెట్టిన మీటర్లు తొలగించాలని, బలవంతంగా పెడితే అడ్డుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, వత్తిదారులందరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సెకితో కుదుర్చుకున్న ఒప్పందం, రాష్ట్రాన్ని దివాళా తీయించే అన్ని ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక నేరానికి పాల్పడిన అదానీ అప్పటి ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలన్న తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, బి వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సూరయ్య, పట్టణ పౌరుష సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమా, డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు పి రాజశేఖర్, సింహాచలం, అఖిలు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐఎంఎల్ నాయకులు రమణి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పీడీ తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఎంఆర్‌సి భవనం పక్కన ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న నిత్యవసర వస్తువులను, రికార్డులను పరిశీలించారు. అలాగే చిన్నారులకు నేర్పుతున్న వివిధ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్.రాజలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మారిషస్ పైనాపిల్‌తో అధిక లాభం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పైలట్ ప్రాజెక్టు కింద సీతంపేట, భామిని మండలాల్లో గిరిజన రైతులకు పంపిణీ చేసిన మారిషస్ పైనాపిల్ మొక్కలను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. పులిపుట్టి పంచాయతీ ఇప్పగూడలో ఈ మొక్కలను పరిశీలించి, వాటి ఎదుగుదలకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మొక్కలు సజీవంగా ఉన్నాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు పంటను పండించే విధానాలను అడిగి తెలుసుకున్నారు. సీతంపేట ఐటిడిఎ ద్వారా 358 మంది రైతులకు 73 ఎకరాలకు గాను 5,89,510 మొక్కలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిహెచ్ఒ ఎస్.వి.గణేష్, హెచ్ఒ పి.జయశ్రీ, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ దివాకర్, మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, కుమార్, దశమమ్మ, సింహాచలం, వెలుగు అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దొరజమ్ము ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం సందర్శించారు. విద్యార్థి పత్రిక దినేష్ మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యమందక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులు, వార్డెన్‌తో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ దొరజమ్ము ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వర్కర్లను నియమించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎం శివ ఉన్నారు.

నకిలీ నియామక ఉత్తర్వులు పట్టించుకోవద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కొన్ని ఏజెన్సీల పేరు తో జారీ అయిన ఉద్యోగ నియామక ఉత్తర్వులను పట్టించుకోవద్దని గిరిజన సంక్షేమ డిడి గయాజుద్దీన్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సర్కులర్ విడుదల చేశారు. ఏజెన్సీలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అటెండర్ ఉద్యోగ నియామక పత్రాలు జారీ చేయడంపై డిడి గయాజుద్దీన్ స్పందించారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఎలాంటి నియామకాలు జరగడం లేదని స్పష్టం చేశారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన కోరారు.

ప్రధానోపాధ్యాయుడి మృతికి ప్రభుత్వమే కారణం

- ఎస్ఎల్‌డిపి శిక్షణలో గుండెపోటుతో హెచ్ఎం మృతి
- శిక్షణను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- మృతునికి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల నిరసన

ప్రజాశక్తి-గజపతినగరం, పార్వతీపురం, భామిని

గజపతినగరం మండలం మరుపల్లి వద్ద బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల (ఎస్ఎల్‌డిపి) స్కూలు లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణలో మన్యం జిల్లా భామిని మండలం నులకజోడు ఎంపియుపి స్కూలు హెచ్ఎ శ్రీనివాసరావు (52) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. పాలకొండ పట్టణంలోని సీతంపేట రోడ్డులో నివాసముంటున్న ఆయన ఆరు రోజులు పాటు ఇక్కడ జరుగుతున్న శిక్షణకు హాజరయ్యారు. ఉపాధ్యాయులంతా సౌకర్యాలు లేకపోయినా విద్యాశాఖ ఆదేశాల మేరకు అక్కడే రాత్రిపూట ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఆయన గుండెపోటుకు గురై మృతి చెందారు. విజయనగరం జిల్లా యుటిఎఫ్ నాయకులు పి.రమేష్‌చంద్ర పట్నాయిక్, చింతా భాస్కరరావు అక్కడికి చేరుకొని విచారం వ్యక్తం చేశారు. సౌకర్యాలు లేకుండా ఇలాంటి శిక్షణ ఇవ్వడం సరికాదని, వెంటనే శిక్షణను రద్దు చేయాలని ఉపాధ్యాయులతో కలిసి నిరసన తెలిపారు.

టీచర్ మృతికి నిరసనగా డిఇఒ కార్యాలయం వద్ద నిరసన

విజయనగరం జిల్లా గజపతినగరంలో ప్రధానోపాధ్యాయులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో భామిని మండల ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతికి నిరసనగా గురువారం జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమితి ఆధ్వర్యాన పార్వతీపురం డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉపాధ్యాయులకు శిక్షణ వద్దని కోరగా, ఎస్‌పిడి అంగీకరించారని, ఇప్పుడు అదే పద్ధతిలో శిక్షణ నిర్వహించడం, ఉపాధ్యాయులను వేధించడమే అవుతుందని అన్నారు. గతంలో ఒక ఉపాధ్యాయుడు శిక్షణ కార్యక్రమంలో గుండెపోటుతో మృతి చెందారని చెప్పారు. మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు భాస్కరరావు, రమేష్, వి హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలువురు సంతాపం

పాలకొండ : ప్రధానోపాధ్యాయులు సిరిపురపు శ్రీనివాసరావు మృతి పట్ల సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు తన సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, విశ్రాంత కమిషనర్ లిల్లీ పుష్పనాథం, వైస్ ఎంపిపి కనపక సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, పాలవలస దవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, విజయ్ కుమార్, చిన్ని తదితరులు ఉన్నారు.

వీరఘట్టం: ఉపాధ్యాయుల మరణానికి కారణమైన రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, మండల అధ్యక్షులు బోనంగి దుర్గ ప్రసాద్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. భామిని మండలం నేరడి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిపురం శ్రీనివాసరావు గుండె పోటుతో చనిపోయిన కారణంగా హెచ్ఎంకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మన్యం జిల్లా డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఏనుగులను తరలించాలి

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో తిష్టివేసి తిరుగుతున్న ఏనుగుల గుంపును అటవీ ప్రాంతానికైనా, జూకైనా తరలించి నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. మండలంలోని గంగిరేగువలస, కుమ్మరిగుంట, విక్రంపురం, కల్లికోట, దుగ్గి గ్రామాల్లో ఏనుగుల బారిన నష్టపోయిన పంట పొలాలను గురువారం పరిశీలించి, రైతులు కష్టాలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించిన అనంతరం గంగరేగువలసలో కౌలు రైతులు గద్దె రమేష్, సుబ్బారావు టమాటా తోటలను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసిన పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గడిచిన 8ఏళ్లుగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఏనుగులు వల్ల నేటికి 12 మంది చనిపోగా సుమారు రూ.6 కోట్ల వరకు పంట నష్టం ఆస్తి నష్టం, వ్యవసాయ సామగ్రికి నష్టం వాటిల్లిందన్నారు. నేటికి రెండున్నరేళ్లుగా నష్టపరిహారం రైతులకు చెల్లించని పరిస్థితి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఏనుగుల వల్ల మీకు భరోసా కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు వెంటనే కుంకీ ఏనుగులను తెప్పించి ఇ క్కడ ఉన్న ఏనుగులను అడవికి లేదా జూకి తరలించి ఈ ప్రాంత రైతుల పంటలకు భరోసా కల్పించాలని కోరారు. అలాగే నష్టపోయని రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రామారావు నాగభూషణ, రైతులు ఉన్నారు.

1నుంచి రెండు పూటలా కళాశాల

పార్వతీపురం: వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిసెంబర్ 1నుంచి రెండు పూటలా కళాశాల ఉంటుందని వృత్తి విద్యాధికారి డి.మంజుల వీణ తెలిపారు. జిల్లాలో షిఫ్ట్ పద్ధతిలో నడుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వీరఘట్టమనితెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు స్టడీ అవర్స్, సబ్జెక్ట్స్ పై రివ్యూ, ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కావున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరయ్యేలా సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల వీరఘట్టం ప్రిన్సిపల్ డిజివి త్రినాధ, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు పని చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆయన చిత్ర పటానికి పూలమాలను వేసి, జ్యోతిని వెలిగించి నివాళ్లు అర్పించారు. అనంతరం డిఐపిఆర్ఒ, కలెక్టరేట్ సిబ్బంది ఆయన చిత్రపటం వద్ద పూల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. పూలే వర్ధంతి కార్యక్రమం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల కోసం, మహిళల విద్య, అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో స్త్రీజనోద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి పూలే అని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : జిల్లా పరిషత్ చైర్మన్ మాజీ పాలవలస రాజశేఖరం స్వగృహం వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే సేవలు మరువలేనివాని, ఆయన ఎందరికో ఆదర్శనీయులని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ ఛైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, వైస్ ఎంపిపి కణపాక సూర్యప్రకాష్, కౌన్సిలర్లు దుప్పాడ పాపి నాయుడు, కడగల వెంకటరమణ, బాబీ, నగర పంచాయతీ మాజీకమిషనర్ ఎద్దు లిల్లీ పుష్పనాథం, చ్రిన్ని , మరియదాస్, పైల వాసు పాల్గొన్నారు.

పూలేకు నివాళి

సాలూరు : ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పూలమాల వేసి నివాళులు అర్పించారు.త ~న నివాసం లో జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు వైసిపి నాయకులు పూలే కి నివాళులర్పించారు. మహిళా అక్షరాస్యత ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్,పట్టణ జెసి ఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ నాయకులు హరి బాలాజీ, పిరిడి రామకష్ణ, ఎం.అప్పారావు పాల్గొన్నారు .

పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు న్యాయమైనవని, వాటిని వారిని పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. స్థానిక ఐటిడి వద్ద అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపడుతున్న దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు ఐటిడిఎ పరిధిలో సుమారు 200 మంది గిరిజన గురుకులాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులను తొలగించి, ఆ పోస్టులను డిఎస్‌సిలో కలపాలని అనుకోవడం అన్యాయమని అన్నారు. 20ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించడం అంటే వారి జీవితాలను రోడ్డుపాలు చేయడమేనని చెప్పారు. గురుకులాల్లో విద్యార్థులకు విద్య అందిస్తూ, వారి ఆరోగ్య బాగోగులు చూస్తూ సేవలందించినా 8ఏళ్ల నుంచి జీతాలు పెరగని దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పోస్టులను డీఎస్సీలో కలపరాదని, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులందర్నీ సిఆర్‌టిలుగా విలీనం చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం వారికి జీతాలు పెంచి కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరు చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు.

పార్వతీపురం : డిఎస్‌సి నుంచి తమ పోస్టులను మినహాయించాలని కోరుతూ 9రోజులుగా ఐటిడిఎ వద్ద దీక్షలు చేపడుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఎపి ప్రభుత్వ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కార్యదర్శి బివి రమణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15ఏళ్ళుగా ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిని రోడ్డున పడేయాలని చూడడం సరైంది కాదన్నారు. డిఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై గురుకులం రాష్ట్ర అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకొని పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే ఆందోళన మరింత ఉధృతమయ్యే పరిస్థితి నెలకొందని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు యూనియన్ నాయకులు దివాకర్, రమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మన్మథరావు

అవుట్ సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి : రాజన్నదొర

సాలూరు : గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం టిడిపి ప్రభుత్వానికి ఉందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో తాను గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఉన్నప్పుడే అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల వేతనాల పెంపు, సిఆర్టీలుగా మార్పునకు సంబంధించిన ఫైలుపై సంతకం చేసి సిఎం జగన్ మోహన్ రెడ్డి కి నివేదించి నట్లు చెప్పారు. మంత్రిగా తాను చేసిన సిఫార్సులను అప్పుడు ఆ సంఘం నాయకులకూ చూపించానని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను సిఆర్టీలుగా మారుస్తామని, వేతనాలు పెంచుతామని టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. 15 ఏళ్లకు పైబడి పని చేస్తున్న వీరిని డిఎస్సీ పేరుతో ఇప్పుడు రోడ్డున పడేయాలని చూడడం తగదని అన్నారు. వీరి ఉద్యోగాలను డిఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని రాజన్నదొర కోరారు.

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి

పార్వతీపురం : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ పోస్టులు డిఎస్‌సిలో కలిపారని, అదే జరిగితే ఉద్యోగం కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ఇస్తున్నట్లు జీతాలు ఇచ్చి సిఆర్‌టిలుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న నరం అజయ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. చిత్తూరు జిల్లా అరగొండలో ఈనెల 22 నుంచి 25 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల పిడి ఎం.శ్రీనివాసరావును విద్యార్థి అజయ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫ్లైఓవర్, ప్రధాన రహదారులపై గోతులు పూడ్చాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ఫ్లై ఓవర్, ప్రధాన రహదారిరోడ్డులో ఉన్న గోతులు, గుమ్ములను ఆర్‌అండ్‌బి అధికారులు మరమ్మతులు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, పడాల రాజశేఖర్ ఫ్లైఓవర్ వంతెన రహదారిని గురువారం పరిశీలించారు. ఫ్లై ఓవర్ వంతెనపై, బైపాస్ రోడ్ లో శిరిడి సాయిబాబా గుడి ఆవరణలో, పాలకొండరోడ్ హనుమాన్ జంక్షన్ వద్ద, రాయగడ రోడ్డు కొత్తవీధివద్ద ఎర్రిపెద్ద పెద్దపెద్ద గోతులు ఉన్నాయని గుర్తించారు. ఈ గోతుల వల్ల వాహన, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం రోడ్డు మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసిన బాగు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు, డబ్బీ వీధి, పెద కోమటి పేట, కోటవీధి, దండిగాం రోడ్డు, రామ కాలనీ, పిఎన్ బొడ్డ వలస, మండలంలోని బాగువలస, బోర బంద, చంద్రంపేట, తాడిలోవ ప్రాంతాల్లో ఉదయం 7 నుండి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహరించగలరని విద్యుత్‌శాఖ ఇఇ కె.గోపాలరావు నాయుడు తెలిపారు.

టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - బలిజిపేట

పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధించాలని ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. మండలంలోని చిలకలపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ముందుగా టెన్త్ విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు ఇంకా మూడు నెలలు మాత్రమే సమయం ఉందని, ఇప్పటి నుంచే పరీక్షలకు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారు ప్రగతి సాధించేలా ప్రతి సబ్జెక్ట్ టీచర్ తగిన ప్రణాళికతో బోధించాలని సూచించారు. త్వరలోనే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చూడాలి

ప్రజాశక్తి - మక్కువ

ధాన్యం కొనుగోలులో రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని మార్కొండపుట్టిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా 12 కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటి కలిపి 41 కేజీలు రైతుల నుండి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎ.బి.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పి.మల్లేశ్వరరావు, బచ్చినాయుడు, వాసుదేవరావు, తూరుమామిడి సర్పంచ్ ఆర్.కృష్ణమనాయుడు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చిత్రాలతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు శంకరరావు

వినూత్న రీతిలో విద్యాబోధన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు బడి పట్ల ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యా బోధన చేస్తున్నారు. మండలంలోని గుణద ప్రభుత్వ పాఠశాల (జివివికె) హెచ్ఎం పత్తిక శంకరరావు పాఠశాల గోడపైన తెలుగు అచ్చులు, హల్లులు, ఇంగ్లీష్, హిందీ అక్షరాలు, రాష్ట్రాల పేర్లు, దేశ నాయకుల చిత్రపటాలు గీసి వాటిని చూపిస్తూ విద్యా బోధన చేస్తున్నారు. దీనివల్ల నేర్చుకోవడానికి సులభతరంగా అవకాశం ఉంటుందని, విద్య పట్ల ఆసక్తి కలుగుతుందని విద్యార్థులు చెబుతున్నారు. మరోవైపు విద్యార్థులు డ్రాపౌట్స్ లేకుండా ఉంటుందన్నారు. పాఠశాల ఆవరణంలో రకరకాల పూల మొక్కలు, కూరగాయల పెంపకంతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.వెంకటాపురానికి చెందిన పరుసుబోతూ సన్యాసమ్మ పురిటి నొప్పులతో బాధపడుతూ గురువారం కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఇఎంటి శ్రీనివాసరావు, పైలెట్ చంద్రం హుటాహుటిన గ్రామానికి చేరుకొని బాధితురాలిని అంబులెన్స్‌పై పిహెచ్‌సికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు రావడంతో అంబులెన్సును ప్రక్కకు ఆపి వైద్యులు అసిక్ సూచనల మేరకు ఇఎంటి శ్రీనివాసరావు డెలివరీ చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం రాజాం కేర్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ బి.వెంకటరమణ పిఒ, ఎపిఒలకు శిక్షణ ఇచ్చారు. డిసెంబర్ 8న జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో వివిధ విధానాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎఇఇ డి.వెంకటరమణ, మండల ఇంజనీరింగ్ అధికారి డి.కళ్యాణి దుర్గ, ఎఒ డి.వెంకటరమణ, ఎంఇఒ-2 ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా కోతలు ఆపాలి

ప్రజాశక్తి - కొమరాడ

తుఫాను కారణంగా మరో 24 గంటల్లో రైతులు తాత్కాలికంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని తహశీల్దార్ శివయ్య తెలిపారు. ఇప్పటికే కోసిన వరి దిబ్బలు వేసుకోవాలని, లేకుంటే తుపాను కారణంగా రైతులు కోతలు తాత్కాలికంగా ఆపాలంటూ రైతులకు సూచించారు. అనంతరం మండలంలోని రెండు రైస్ మిల్లులను పరిశీలించారు. ఇప్పటికే కోతలు నూర్పు పూర్తయ్యే ధాన్యం రైతులు రైస్ మిల్లులకు తరలించుకోవచ్చని తెలిపారు. రైతులు దళారుల నుంచి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఒ పి.శంకరరావు, విఆర్ఒ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వేలన్నీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

పంచాయతీల్లో నిర్దేశించిన సర్వేలన్నీ త్వరగతిగా పూర్తి చేయాలని ఎంపిడిఒ జె.ఉమా మహేశ్వరి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంతవరకు పంచాయతీల్లో జరిగిన ఎన్‌పిసిఐ, హౌస్ హెల్డ్ జియోట్యాగింగ్, హౌస్ టేక్స్, డేటాఎంట్రీ సర్వేలపై లోటుపాట్లను అడిగి తెలుసుకుని సర్వేలన్నీ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులందరికీ చట్టాలు అమలు చేయాలి

ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డిమాండ్

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఎయిర్ బస్సు డ్రైవర్లకు కార్మికశాఖ ఇస్తున్న సర్క్యులర్ల ప్రకారం జీతాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్, సెలవులు వంటి కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఎపిఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరాం, జిల్లా నాయకులు వి.చంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్టీసీలో కార్మిక చట్టాలు అమలు చేసి సర్క్యులర్ ప్రకారం స్కిల్డ్ వర్కర్లకు రూ.11900, సెమీ స్కిల్డ్, వర్కర్లకు రూ.14058, డ్రైవర్లకు రూ.17266, ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు సెలవులు, లేబర్ హాలిడేస్ తదితర హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈనెల 7న లేబర్ ఆఫీస్‌లో జరిగిన జాయింట్ మీటింగ్‌లో చర్చలు జరిగాయని, చట్టప్రకారం కార్మికులందరికీ ఆర్టీసీలో జీవోలను అమలు చేయడం లేదని తెలిపారు. మళ్లీ డిసెంబర్ 4న విశాఖలో గల లేబర్ ఆఫీస్‌లో జరుగు సమావేశానికి అన్ని డిపోల నుంచి కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని, డిమాండ్ సాధించుకునే వరకు ఐక్యంగా పోరాడేందుకు సిద్ధపడాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ థర్డ్ పార్టీ పేరుతో ఆర్టీసీ లో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం కార్మికులకు సహకరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున పోరాడేందుకు వెనుకాడమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మిక సంఘం నాయకులు శంకర్, వి.సీతారాం, వి.ప్రభు, ఎల్.రమేష్, బి.సురేష్, సభాష్టియన్, జి.కుమార్, తేజ, ఖాన్, పోలారావు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

గేట్‌మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు తులసీరాం

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట గిరిజన సంస్కృతి పరిశోధన, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా, ఇతర పోటీల్లో స్తానిక ఐటిడిఎ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి గురువారం తన ఛాంబర్లో అభినందించారు. అనంతరం పిఒ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని అన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సీతంపేట, ఐటిడిఎ విద్యార్థులు కైవసం చేసుకొన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఎఒ సునీల్, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సిసి రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ వనం గుడి, అమ్మవారి గుడి పరిసర ప్రదేశాల్లో, అలాగే గ్రామంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, కాలువ పనుల్లో నాణ్యత పాటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన రహదారులు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రూ.2.40 కోట్లతో శంబర పోలమాంబ గుడి ఆవరణలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, కాలువలు రిటర్నింగ్ వాల్‌పై అనేక అనుమానాలు ఉన్నాయని ఈ సందర్భంలో పరిశీలన చేయాలని అన్నారు. ఈ పనుల్లో సిమెంట్ రోడ్డు కింద వేసిన 40 ఎంఎం మెటల్ రోడ్డు నాణ్యత సరిగ్గా లేదని, అలాగే శంబర గోముఖీ నది ఒడ్డున నిర్మిస్తున్న రిటర్నింగ్ వాల్ రాయి నాణ్యత సరిగా లేదన్నారు. అలాగే వనం గుడికి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తీయకుండానే రోడ్డు నిర్మించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ స్తంభాలను పక్కకు తరలించి రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పనులపై మంత్రి సంధ్యారాణి ప్రత్యేక దృష్టి పెట్టి చేయించాలన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపించినా, విద్యుత్ స్తంభాలు తొలగించకపోయినా రానున్న రోజుల్లో ప్రజలను కదిలించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అల్లు ఆదినారాయణ పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తిరుపతిరావు

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి - భామిని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండల సిపిఎం మహాసభ ఇసుకగూడలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తాగు నీరిచ్చేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో దళారుల బారిన రైతులు పడి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేవారు. వంశధార కాలువ పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరందించాలని, సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నిర్మించాలని, పత్తికి గిట్టుబాటు ధర ఇచ్చేలా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, కొత్తూరు నుండి బత్తిలి వరకు గల ఏబీ రోడ్ మరమతులు చేపట్టాలి, భామినిలో గల 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, జెజెఎం ద్వారా ప్రతి గ్రామానికి మంచినీరు అందించాలని తీర్మానించారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నికైంది. కార్యదర్శిగా కొప్పర మిన్నారావు, సభ్యులుగా జి.జగన్నాయకులు, కొండగొర్రె భాస్కరరావు, కొండ గొర్రె ప్రసాదరావు, పాలక ఆయుబ్, గొర్ల ప్రసాదు, సవర కువ్వారి ఎన్నికయ్యారు.

మన విత్తనం - మంచి విత్తనం

నాబార్డ్ డిడిఎం దినేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని చాపరాయిబిన్నిడి పంచాయతీ పరిధిలో, బాతుగుడబలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న జీవ కార్యక్రమంలో భాగంగా మా తోట రైతులకు విత్తనం ఎంపిక, సంరక్షణ, పంట కోసిన తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాబార్డ్ డిడిఎం దినేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పెట్టుబడి తగ్గి దిగుబడులు పెరగడానికి మొట్టమొదటిగా చేయాల్సింది విత్తన ఎంపిక అన్నారు. విత్తనం మంచిదైతే పైరు ఏపుగా పెరిగి, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని, ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి, రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు ద్వారా 29శాతం కాలుష్యానికి గురవుతుందని, దీని నివారణకు ప్రకృతి వ్యవసాయంలో సహజ వనరులను వినియోగించుకొని పంటలు పండించడం ఏకైక మార్గమని అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసి రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును, ఆరోగ్యవంతమైన భూమిని బహుమానంగా ఇవ్వాలని సకల జీవరాసులకు అన్ని రకాల పోషకాలు లభించినప్పుడే అవి పరిపుష్టిగా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. డిపిఎంపి. షణ్ముఖరాజు మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో ఈ రబీ సీజన్లో పంట మార్పిడి విధానం ద్వారా వరి పంట కోసే వారం రోజులు ముందు అపరాలైన పెసలు, మినువులు ,ఉలవలు వేసుకోవాలని, రబీ పంటలైన కొమ్ము శనగ, వేరుశనగ, సూర్యకాంతం మొదలగు పంటలు వేసుకొని అదనపు దిగుబడులు పొందేలా ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ ప్రహరాజ్, జీవ మాతోట కమిటీ అధ్యక్షులు తాడింగి జమ్మయ్య, సభ్యులు గీత, పి.లక్ష్మి, మాజీ సర్పంచ్ కె.జ్యోతి, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి. ప్రభోదు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అలిమ్ కో సంస్థ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో ఎంపికైన వారికి పత్రాలను పంపిణీ చేశారు. నెల, రెండు నెలల్లో పరికరాలు వస్తాయని వాటిని అప్పుడు పంపిణీ చేస్తామని తెలిపారు. భామిని మండలంలో సెప్టెంబర్ 17న ఆశావాహ బ్లాక్ కింద 147 మంది అభ్యర్థులకు రూ.28 లక్షల విలువైన పరికరాలు పంపిణీ చేశారన్నారు. దీన్నిస్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో గుర్తింపు శిబిరాలను నిర్వహించాలని జిల్లా యంత్రాంగం ఆలోచించింది. ఈ మేరకు హైదరాబాద్ ఆధారిత అలిమ్ కో (ఆర్టిఫిషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ) సహకారంతో ఈ నెల 26న సాలూరులో, 27న పాలకొండలో, 28న పార్వతీపురంలో 250మందిని ఎంపిక చేశారు. 29న కురుపాంలో ఏర్పాటు చేస్తుందన్నారు. వికలాంగ అభ్యర్థులను పరీక్షించి, వారి వైకల్యానికి అవసరమగు పరికరానికి ఎంపిక చేసి వారికి ఉచితంగా పరికరాలు సరఫరా చేస్తామన్నారు.

గుర్తింపు శిబిరాలకు స్పందన

ఇదిలా ఉండగా గుర్తింపు శిబిరాలకు లబ్ధిదారుల నుంచి మంచి స్పందన లభించింది. సాలూరులో 82 మంది అభ్యర్థులను ఎంపిక చేసి సుమారు రూ.17.18 లక్షల విలువ గల పరికరాలు అందనున్నాయి. పాలకొండలో 75 మందికి గానూ రూ.11.87 లక్షల విలువ గల పరికరాలు అందనున్నాయి. పార్వతీపురంలో జరిగిన శిబిరానికి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు. కురుపాంలో మంచి స్పందన రాగలదని ఆశిస్తున్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవద్దుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, డిడిఒ రమేష్ రామన్, అలిమ్కో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఇవిఎం గోదాములను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసి ఉన్న సీల్ వేయబడిన తాళాలు, వెలుపల ఉన్న సీసీ కెమెరాల పనితీరును గమనించారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బందికి, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని, పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు..

వైస్ ఎంపిపి భర్త మృతి

బలిజిపేట : మండలంలోని వంతరాంకు వైస్ ఎంపిపి బెవర హేమలత భర్త రాజు మాస్టారు గుండె పోటుతో అకాల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో పాటు కలిసి వంతరాం వెళ్లి రాజు మాస్టారు పార్థివ దేహానికి నివాళులర్పించి కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేశారు.

పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

విశాఖ జిల్లా అనంతగిరి రెవెన్యూ పరిధిలో గల బర్రె మామిడి పంచాయితీ బొడ్డపాడు, మూటకూడు పంచాయతీలను అనంతగిరి రెవెన్యూ నుంచి తొలగించి సర్వేలు నిర్వహించి అటవీ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు సేబి శ్రీరామ్, సొయ్యారి సన్యాసి, ఎస్.రమేష్ ఆధ్వర్యంలో మూటకూడు బొడ్డపాడు జంక్షన్లో వద్ద గురువారం గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సేబిశ్రీరామ్ అటవీ హక్కులు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని తమ భూములకు పట్టాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సర్వేలు చేసిన అధికారులు అనంతగిరి రెవెన్యూలో గల ఈ భూములకు సాగు పట్టాలు ఇవ్వాలంటే రెవెన్యూ పరిధిలను తొలగించి పాచిపెంట మండలం రెవెన్యూ పరిధిలోకి మార్చి గిరిజనులకు పట్టాలు ఇస్తామని చెప్పినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ సమస్యపై అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్న పట్టించుకోకపోవడంతో గిరిజనులకు ఎటువంటి హక్కులు లేకుండా ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అనంతగిరి రెవెన్యూను పరిధిలో గల భూములను మార్పులు చేసి వెంటనే బొర్రమామిడి పంచాయతీలో మూటకూడు పంచాయతీలో గల భూములకు ఎగు గొట్టూరు పరిధిలో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమం లో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు

మరణాల అదుపునకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాల అదుపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో పలు ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మలేరియా, విష జ్వరాల బారినపడి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస మరణాలు జరుగుతున్న వైద్య ఆరోగ్యశాఖ, ఐటిడిఎ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలందించే ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో వైద్యమందక మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు మరణాల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి మెరుగైన వైద్య సేవలందే దిశగా చూడాలని కోరారు.

ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ వెంటనే ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ వెంటనే ప్రకటించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు కోరారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల కాలంలో ఎక్కువగా విష జ్వరాలు వస్తున్నాయన్నారు. మరో వైపు విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయన్నారు. వీటిని వెంటనే నిర్మూలించడం కోసం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజల ప్రాణాలకు కాపాడుతారని ఆరోగ్యశాఖ అధికారులకు విన్నవించారు.

ఆశ్రమ పాఠశాలల్లో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్ రాష్ట్రీయ బాల స్వస్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శీతాకాలంలో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలుబు, దగ్గు రాకుండా సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కెజిబివి కాలేజీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులతో పాటు ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, వసతి గృహ అధికారిని పాలక అమల, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధిలోని జె.గోపాలపురానికి చెందిన ఊయక చంద్రశేఖర్(30) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలిన్నాయి. ఆముదాలవలస మండలంలో జరుగు జల జీవన్ మిషన్ పనులు ఒప్పుకునేందుకు గురువారం తమ గ్రామం నుంచి కూర్మినాయుడు, చంద్రశేఖర్ బైకు వెళ్తుండగా తిమ్మాపురం జంక్షన్ వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొంది. దీంతో బైకు వెనుక కూర్చున్న చంద్రశేఖర్ బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుర్మినాయుడుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ డ్రిల్లింగ్ మిషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో అతని తల్లి కన్నీరు మున్నీరై విలపిస్తుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3న సికిల్ సెల్ పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

పిఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ, సీతంపేట పరిధిలో గల 20 గిరిజన మండలాల్లోని 0-40 వయస్సు మధ్య గల గిరిజన ప్రజలు విద్యార్థులకు ఈ ఏడాది జనవరి నుండి మార్చి వరకు చేసిన సికిల్ సెల్ అనీమియా పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి డిసెంబర్ 3న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కెజిహెచ్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక వైటిసీలో సికిల్‌సెల్ హెచ్ పిఎల్‌సి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఐటిడిఎ పరిధిలోని 20 మండలాల్లో 195 మందికి పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. వీరికి డిసెంబర్ 3న హెచ్ పి ఎల్ సి పరీక్షలు చేసి, అందులో పాజిటివ్ వచ్చిన వారికి కేల్ సెల్ ఎనిమీయా పాజిటివ్ సర్టిఫికేట్ అందజేస్తామన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో పారిశుధ్య పనులను బలిజిపేట పిహెచ్‌సి వైద్యాధికారి కిరణ్మయి గురువారం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించారు. అనంతరం స్థానిక సర్పంచ్ నగరి పాపారావు సమక్షంలో ప్రధాన వీధుల్లో ఉన్న చెత్తను ట్రాక్టర్లతో ఎత్తివేయడంతో పాటు గ్రామ చివర్లో నిల్వ ఉన్న చెత్తను కూడా వేరే ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పట్టణ సిఐ మురళీధర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రధాన రహదారి కిరువైపులా ఉన్న వాణిజ్య దుకాణాల యజమానులు కాలువలపై చేసిన ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం సిఐ మాట్లాడు తూ జిల్లా కేంద్రంగా ఉన్న ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, ఏ ఒక్క దుకాణ యజమానులు మున్సిపల్ కాలువ దాటి ఆక్రమణలు చేయరాదని, ఉన్న ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశించారు.

హౌస్ హోల్డ్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి, శంభం, కిండంగి గ్రామ సచివాలయాల పరిధిలో చేపడుతున్న హౌస్ హెల్డ్ సర్వేను ఎంపిడిఒ కె.గీతాంజలి గురువారం పరిశీలించారు. బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్ నెంబర్‌కు లింక్ చేసుకోవాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. కిండంగి ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సిడిసిడి సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సర్వేలో పూర్తి చేయాలని చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. గురువారం కురుపాంలో జరిగిన వారపు సంతలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సంతకు వచ్చిన ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల చట్టాలు, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగిన ప్రమాదాలు గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం మొబైల్ ఫోన్ వాడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలనిని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

బలిజిపేట : మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సంకల్పంతో ముందుకు రావాలని ఎస్సై ఎస్.సింహాచలం పిలుపునిచ్చారు. మండలంలోని పెదపెంకిలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : సైబర్ నేరాల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తతో ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. సంకల్పం లో భాగంగా సీతానగరం బజార్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అధిక ధరలకు విక్రయించే ఎరువుల డీలర్ల పై చర్యలు

ప్రజాశక్తి - పాచిపెంట

అధిక ధరలకు ఎరువులు విక్రయించిన డీలర్లపై చర్యలు తీసుకుంటున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని శ్రీకృష్ణా స్టోర్స్, బోర త్రినాధ ఎరువుల షాపులలో ఆకస్మిక తనిఖీ చేయగా రసీదులు ఇవ్వకుండా రైతులకు ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వీరికి ఎరువుల విక్రయం నిలుపుదల చేసినట్లు తెలిపారు. అంతేకాక తగు చర్యల నిమిత్తంపై అధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు తెలిపారు. రసీదు ఇవ్వకుండా అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విఎఎల పర్యవేక్షణలో ఎరువులు విక్రయించబడతాయని వ్యవసాయ అధికారి తెలిపారు. వ్యవసాయ అధికారితో పాటు విఎఎ కిరణ్, రాకేష్ పాల్గొన్నారు